క్లుప్తంగా

కొనసాగుతున్న మొహర్రం


న్యాల్‌కల్‌లో పీర్ల ఊరేగింపు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం ఆయాగ్రామాల్లోని అశుర్కానాల్లో ప్రతిష్ఠించిన పీర్లకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీర్లను గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. రాత్రి అశుర్కానాల వద్ద మజ్ను కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పీర్లకు ప్రజలు పూజలు చేసి మ్కులు చెల్లించుకుంటున్నారు.

రోడ్డును తవ్వడంపై గిరిజనుల ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న శ్యామానాయక్ తండావాసులు

నారాయణఖేడ్: ఖేడ్ నుంచి మండలంలోని హంగర్గా(కె) మీదుగా శ్యామానాయక్ తండా వరకు మట్టి రోడ్డు ఉంది. హంగర్గా(కె)–శ్యామానాయక్ తండాల మధ్య రోడ్డు తమ భూమిలోంచి ఉందంటూ శనివారం హంగర్గా(కె) గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు జేసీబీతో రోడ్డును తవ్వించారని తండావాసులు ఆరోపించారు. రాకపోకలు ఎలా సాగించాలని, బస్సు, అత్యవసర పరిస్థితులొస్తే పరిస్థితి ఏంటని అన్నారు.దీంతో రోడ్డుకు అడ్డంగా చెట్ల కొమ్మలు వేసి ఆందోళన చేపట్టారు.

వారాహిగుప్త నవరాత్రి ఉత్సవాలు


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

నారాయణఖేడ్: పట్టణ శివారులోని మనూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని శ్రీచక్ర లలిత త్రిపుర సుందరీ దేవీ ఆలయంలో వారం రోజులుగా కొనసాగిన వారాహి గుప్త నవరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజ ఆలయ నిర్వాహకులు శ్రీపంతులు ఆధ్వర్యంలో అమ్మవారిని శాకంబరి మాతగా అలంకరించారు. హోమం, సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర నామావళి, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

స్వచ్ఛంద సంస్థ చేయూత


స్వచ్ఛంద సంస్థ నిర్మించిన మూత్రశాలలు

నారాయణఖేడ్: మండలంలోని అబ్బెంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు యునైటెడ్ వే ముంబయి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ ప్రతినిధులు నాలుగు నెలల కింద పాఠశాలను సందర్శించి ఇబ్బందులను గుర్తించారు. రూ.3 లక్షలు వెచ్చించి నిర్మాణం ప్రారంభించారు. ప్రస్తుతం పనులు పూర్తవ్వడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ట్రిపుల్‌ఐటీకి ఇద్దరు విద్యార్థులు


నవీన


జునేద్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మిర్జాపూర్(బి) జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు బాసరలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంఈఓ మారుతి రాథోడ్ శనివారం మీడియాకు వెల్లడించారు. ఏప్రిల్‌లో వెలువడ్డ పదవ తరగతి ఫలితాల్లో ఆయా పాఠశాలకు చెందిన నవీన 600 మార్కులకుగాను 561, జునేద్ 559 మార్కులు సాధించారు. దీంతో ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను మారుతి రాథోడ్, పాఠశాల హెచ్ఎం రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుపయోగంగా ధోబీ ఘాట్లు

- నీటి సౌకర్యం లేక రజకుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


హత్నూరలో నిరుపయోగంగా ఉన్న ధోబీ ఘాట్లు

హత్నూర(సంగారెడ్డి): ధోబీ ఘాట్లు నిర్మించి నీటి సౌకర్యం కల్పించకపోవడంతో కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. మండల కేంద్రమైన హత్నూరలో రజకుల సౌకర్యార్థం రెండు దశాబ్దాల క్రితం అప్పటి మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ధోబీ ఘాట్లను నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. అప్పట్లోనే త్వరతగతిన ధోబీ ఘాట్లను నిర్మించారు. కానీ నీటి సౌకర్యం కల్పించకపోవడంతో అప్పటి నుంచి నిరుపయోగంగానే మిగిలిపోయాయి. అలాగే చింతల చెరువులో గతంలో నిర్మించిన ధోబీ ఘాట్లకు కూడా నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారిపోయింది. దౌలాపూర్ గ్రామం సమీపంలో అప్పటి మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే సునీతారెడ్డి ధోబీ ఘాట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో ఆర్భాటంగా నిర్మాణం చేపట్టారు. కానీ బోరు పైపు లైన్ వేయకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. కుల వృత్తులను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా ఆదుకుంటామని చెబుతున్న ప్రస్తుత ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం.. అధికారులు వాటిని మరిచిపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ధోబీ ఘాట్లు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

> **నీటి సౌకర్యం కల్పించాలి**
>
> 
>
> 20 ఏళ్ల క్రితం నిర్మించిన ధోబీ ఘాట్లకు నీటి సౌకర్యం కల్పిస్తే మాకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. రోజూ బట్టలు శుభ్రపరిచేందుకు మహిళలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి నూతనంగా బోరుతో పాటు పైపులైన్ వేయించాలి.
>
> – వెంకటేశం, హత్నూర, రజకుడు

సమన్వయంతోనే పార్టీ బలోపేతం

ఎమ్మెల్యే మాణిక్‌రావు


దత్తురెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్‌టౌన్: అందరు సమన్వయంతో ముందుకు వెళ్తేనే పార్టీని బలోపేతం చేయగలమని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. హుగ్గెల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా దత్తురెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎండీ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా బొడ తుకారాంను నియమించి క్యాంపు కార్యాలయంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అధ్యక్షులు, కమిటీ సభ్యులను కలుపుకుని ముందుకు వెళ్లాలన్నారు. దత్తురెడ్డి ఆధ్వర్యంలో హుగ్గెల్లిలో పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన గ్రామ కమిటీని అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తట్టునారాయణ, నాయకులు శంకర్, కృష్ణారెడ్డి, భీమ్ రాథోడ్, మధు, షకీల్, బాబులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ వైరు తప్పిన ప్రమాదం


హత్నూరలో తెగిపడిన విద్యుత్ వైరు

హత్నూర(సంగారెడ్డి): ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగపడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మండల కేంద్రమైన హత్నూరలో శనివారం చోటుచేసుకుంది. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న విద్యుత్ వైర్లు ఒకసారి తెగిపడడంతో అక్కడున్న హోటల్‌పై పడడంతో విద్యుత్ వైరు తెగిపడిన సందర్భంలో ఎవరు అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కొన్ని రోజులుగా విద్యుత్ వైర్ల కింద చెట్లు తగిలి మంటలు వస్తున్నాయని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట జన సంచారం ఉంటుందని, ఈరోజు ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

‘పాకల’ బిల్లులు ఎప్పుడు..?


కలివేములలో నిర్మాణం పూర్తయిన పశువుల పాక

కంది(సంగారెడ్డి): పశువుల పాకలు నిర్మించుకున్న రైతులు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పశువుల పాకలు నిర్మించుకొని నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు చెల్లించడం లేదని రైతులు వాపోతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కనీసం మూడు పశువులు కలిగి ఉన్న రైతులకు పశువుల పాకలు నిర్మించుకునేందుకు రూ 90 వేల చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. కంది మండలానికి 20 పశువుల పాకల నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడంతో 13 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో కలివేములలో మూడు, ఎర్ధనూరులో మూడు, ఇంద్రకరణలో రెండు, ఉత్తరపల్లిలో ఒకటి, బ్యాతోల్ గ్రామంలో మూడు చొప్పున పశువు ల పాకలను నిర్మించుకున్నారు. మార్చి నెల లోపు నిర్మించుకుంటే డబ్బులు వెంటనే వస్తాయని అధికారులు చెప్పారని రైతులు చెబుతున్నారు. బిల్లులు వస్తాయన్న ధీమాతో ఇతరుల వద్ద అప్పు తీసుకొని పాకలు నిర్మించుకున్నామని తమకు వెంటనే బిల్లులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఉపాధి హామీ ఏపీవో గురుపాదంను వివరణ కోరగా.. కొంత మందికి లేబర్ పేమెంట్ రూపంలో 20శాతం డబ్బులు వచ్చాయన్నారు. మెటీరియల్ రూపకంగా వచ్చే డబ్బు త్వర లో వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

పేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తంగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, డివిజన్‌లకు సంబంధించిన 48 మంది లబ్ధిదారులకు మంజూరైన 22 లక్షల 10 వేల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పూర్తి పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యాంరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ప్రమోద్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి


రోడ్డుపై నిలిచిన నీటి చూపిస్తున్న కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో శనివారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు అధికారులను కోరారు. పలు వీధులలో సీసీ రోడ్లు అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ కాలనీవాసులు తన దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు మల్లేష్, రవికిరణ్, భాస్కర్, ప్రీతిగౌడ్, రాజులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బౌద్ధ పర్యాటక కేంద్రంగా మార్చాలి

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర సరిహద్దులో ఉన్న గోట్టం కోట ప్రాంతాన్ని బౌద్ధ పర్యాటక కేంద్రంగా మార్చాలని కర్నాటకలోని బీదర్ ఎంపీ.సాగర్ ఈశ్వర్ ఖండ్రేను కోరినట్లు మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు దీపక్ ఆకాశ్ తెలిపారు. శనివారం బీదర్‌లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశామని చెప్పారు. జహీరాబాద్‌కు 26కిలో మీటర్ల దూరం, మండల కేంద్రమైన మొగుడంపల్లికి కేవలం 5కిలో మీటర్ల దూరంలో గోట్టం కోట ప్రాంతం కర్నాటక రాష్ట్రంలో ఉంటుందని, ఈ ప్రాంతంలో బుద్ధిస్టులు నడయాడారని పురావస్తు విద్యార్థులు చేసిన పరిశోధనలో తెలిసిందని చెప్పారు. అందుకని ఈ ప్రాంతాన్ని బౌద్ధ పర్యాటక కేంద్రంగా మార్చాలని ఎంపీని కోరామని చెప్పారు.

◆ సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు



వట్‌పల్లి(అందోల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయలేదని ఈనెల 5న సాక్షి దినపత్రికలో ‘సమాచార హక్కు చట్టం బోర్డులేవి..?’ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు తహసీల్దారు కార్యాలయంలో బోర్డును ఏర్పాటు చేశారు.

◆ వైద్య శిబిరం విజయవంతం



హత్నూర(సంగారెడ్డి): మండలంలోని సిరిపురలో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య మెగా శిబిరం విజయవంతం అయిందని మాజీ సర్పంచ్ నరేందర్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 306 మంది వైద్యం పరీక్షలు నిర్వహించుకోగా 70 మందిని అడ్మిట్ చేసుకొని వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నాగేష్ గౌడ్ రంగారెడ్డి భిక్షపతి, లచ్చయ్య పాల్గొన్నారు.

◆ బసవేశ్వర విగ్రహం బహూకరణ



సదాశివపేట(సంగారెడ్డి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాంచంద్రరావుని ఆ పార్టీ మెదక్ పార్లమెంట్ కన్వీనర్ కోవూరి సంగమేశ్వర్ శనివారం సన్మానించారు. బసవేశ్వరుని విగ్రహాన్ని బహూకరించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్: ఈనెల 10న గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఖేడ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బస్సు ఈనెల 8న సాయంత్రం 4 గంటలకు ఖేడ్ నుంచి అరుణాచలానికి బయలు దేరుతుందన్నారు. 9వ తేదీన ఉదయం కాణిపాకం, సాయంత్రం గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని అక్కడి నుంచి 10న గురుపౌర్ణమి నాడు ఉదయం అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం జోగులాంబ తల్లి అమ్మవారిని దర్శించుకున్నాక బయలుదేరి 11వ తేదీ రాత్రి ఖేడ్‌కు వస్తుందన్నారు. ఒకొక్కరికీ ఛార్జీ రూ.4,500 ఉంటుందన్నారు. వివరాలకు, టికెట్లు బుకింగ్‌కు 9959 223170, 90634 17294లో సంప్రదించాలని సూచించారు.

రిక్వెస్ట్ స్టాప్ కోసం డీఎంకు వినతి

నారాయణఖేడ్: విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం నిజాంపేట్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న 161 ఫ్లైఓవర్ దగ్గర ఆర్టీసీ బస్సుల రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ సంగ్రాం కోరారు. ఈమేరకు లేఖ నం. ఏ2/32/2025 ద్వారా ఖేడ్ డీఎం మల్లేశయ్యకు శనివారం లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. నిజాంపేట్ మండలంగా ఏర్పాటైందని, పలు గ్రామాల విద్యార్థులు, ఎంపీడీఓ, పీహెచ్‌సీ, పంచాయతీ కార్యాలయాలకు అధికారులు, ప్రజలు వస్తారని తెలిపారు. అందరి సౌకర్యార్థం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30వరకు ఎక్స్‌ప్రెస్, ఆర్డీనరీ బస్సులను ఆపాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నారాయణఖేడ్: సీజనల్ వ్యాధులను పారద్రోలడం మన చేతుల్లోనే ఉందని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, కలరా, టైఫాయిడ్ సోకకుండా దోమలను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఖాళీ ప్రదేశాలు, ఇళ్ల ఆవరణలు, పూల కుండీలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. మెనేజర్ వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

చెరువులో చేపల వేలం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు చెరువులోని చేపలను శనివారం వేలం పాట నిర్వహించారు. మూడు ఏళ్లుగాను గ్రామానికి చెందిన మహేష్ రూ.12లక్షల 65వేలకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కొల్లూరు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయను ఘనంగా సన్మానించారు.

‘సదరం’ స్లాట్‌బుక్ చేసుకోండి

చిన్నశంకరంపేట(మెదక్): ఈ నెల 9న మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే సదరం క్యాంపులో వికలాంగుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు అవసరమైన వారు స్లాట్‌బుక్ చేసుకోవాలని నార్సింగి ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ కోరారు. ఈ క్యాంపులో శారీరక, చెవుడు, మూగ, మానసిక, దృష్టిలోపం ఉన్న వారు ముందుగా మీ సేవా కేంద్రం ద్వారా స్లాట్‌బుక్ చేసుకోవాలని సూచించారు. బుధవారం నిర్వహించే సదరం క్యాంపులో 55 మందికి పరీక్షలు నిర్వహించనున్నారని, అలాగే రెన్యువల్ కోసం మరో 30 మందికి అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పలుగు పోచమ్మ ఆలయం వద్ద వేలం పాట


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి గ్రామ శివారులోని పలుగుమీది నల్ల పోచమ్మ దేవాలయం వద్ద శనివారం వస్తువుల విక్రయానికి అధికారులు వేలంపాట నిర్వహించారు. ఆలయం వద్ద కొబ్బరికాయల అమ్మకానికి రూ.9.72 లక్షలకు నీరజ, అమ్మవారి పట్టు చీరలకు రూ.1.35లక్షలకు ఆశన్న గౌడ్, ఒడిబియ్యం రూ.1.35లక్షలకు ఆశన్న గౌడ్, కుడుకలు రూ.50 వేలకు పోచయ్య, లడ్డూ ప్రసాదం రూ.5.14 లక్షలకు వంశీ, మొక్కుబడి మేకలు రూ.2.1లక్షలకు నవీన్ కుమార్ వేలంపాటలో దక్కించుకున్నారు. వేలం హక్కులు పొందిన సభ్యులు ఏడాదిపాటు ఆలయం వద్ద వాటిని విక్రయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈవో దేవనాదం, తహసీల్దార్ పర్వీన్షేక్, ఈవోలు శ్రీనివాస్, వెంకటయోగి, పాలకవర్గం చైర్మన్ మల్లగౌడ్, పూజారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి


నీటి తరలింపునకు కాల్వ తవ్విన దృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని తెల్లాపూర్ కమాన్ వద్ద రేడియల్ రోడ్డుపై నిలిచిన నీటిని కాలువ చేసి మళ్లించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరి గారి రమణ పాల్గొన్నారు.

టీఆర్టీయూసీ విజయకేతనం

కార్మికుల సంబురాలు


విజయోత్సవ సంబరాల్లో కార్మికులతో వరప్రసాద్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో శనివారం జరిగిన హెర్టెక్స్ పరిశ్రమ గుర్తింపు ఎన్నికల్లో టీఆర్టీయూసీ నేత వరప్రసాద్ రెడ్డి విజయం సాధించారు. ఐఎన్‌టీయూసీ తరపున పోటీ చేసిన నరసింహారెడ్డిపై వరప్రసాద్ రెడ్డి 119 ఓట్లతో విజయం సాధించారు. వరప్రసాద్ రెడ్డికి 337 ఓట్లు రాగా.. నరసింహారెడ్డికి 218 బీఎంఎస్‌కు 60 ఓట్లు వచ్చాయి. ఈ విజయంతో కార్మికులు సంతోషంగా సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనియన్ నాయకుడు వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం టీఆర్టీయూసీ కార్మికుల పక్షానే నిలిచిందన్నారు. తనకు అండగా నిలిచిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కార్మికులతో కలిసి వరప్రసాద్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు చంద్రారెడ్డి, నాయకులు దీనానాథ్, శ్రీమన్నారాయణ, రాజారాం, లకంసింగ్, కార్మిక నాయకులు ఉద్యాన ధర్మేందర్ యాదవ్, ఉమాకాంత్ యాదవ్, తివారి, కార్మికులు పాల్గొన్నారు.

ఆధునిక సాగుపై దృష్టి సారించండి

వ్యవసాయ అధికారిని ఝాన్సీ


డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తనం నాటే విధానం పరిశీలిస్తున్న ఏఓ ఝాన్సీ

వెల్దుర్తి(తూప్రాన్): వరి సాగులో రైతులు సంప్రదాయ సాగు విధానాలకు స్వస్తి పలికి ఆధునిక సాగు విధానాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయ అధికారిని ఝాన్సీ అన్నారు. ఈ మేరకు వెల్దుర్తి గ్రామ శివారులో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరినాటు వేసిన రైతు తోట నర్సింలు వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నారుమడి పద్ధతిలో ఎకరాకు 20 నుంచి 25 కేజీలు విత్తనాలు అవసరమైతే డ్రమ్ సీడర్, వెదజల్లె పద్ధతిలో కేవలం 8 నుంచి 10 కేజీల విత్తనాలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. వరినాటు కోసం ఎకరాకు 5 నుంచి 6 వేలు ఖర్చు అవుతుందని అదే డ్రమ్ సీడర్ పద్ధతిలో కేవలం ఒక వ్యక్తితో ఒక్కరోజులో సుమారు మూడు ఎకరాలు విత్తనం వేసుకోవచ్చన్నారు. తద్వారా రైతులకు పంట పెట్టుబడి చాలా తక్కువగా అవుతుందన్నారు. రోజురోజుకూ వస్తున్న మార్పులకు అనుగూనంగా రైతులు ఆధునిక సాగువైపు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ మజీద్, వందన ఉన్నారు.

గిరిజన విద్యార్థులకు బ్యాగుల పంపిణీ


విద్యార్థులకు వస్తువులు పంపిణీ చేసిన దృశ్యం

పాపన్నపేట(మెదక్): కనీస సౌకర్యాలు లేని గిరిజన తండా పాఠశాల విద్యార్థులకు ఓ మహిళ బ్యాగు లు, పెన్నులు, పుస్తకాలు, వాటర్‌బాటిల్స్ పంపిణీ చేసి తన ఉదారత చాటుకుంది. పాపన్నపపేట మండలంలోని అమ్రియా తండాలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రవీందర్ కోరిక మేరకు అతని సోదరి ప్రమీల తన భర్త బాలకృష్ణ జ్ఞాపకార్థం విద్యార్థులకు అవసరమైన వస్తువులు పంపిణీ చేసింది. తండావాసులు ప్రమీల, ఆమె కూతురు శ్రావణి, హెచ్ఎం రవీందర్‌ను ఘనంగా సన్మానించారు.